సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం | 2 | ఆగస్టు | 2024



మిడ్‌మానేరులో 11 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులో ప్రస్తుతం 11.68 టీఎంసీలకు చేరింది. రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రీ పంప్‌హౌస్ నుంచి 12,600 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో వస్తోంది.



ఎగువమానేరులో 15 ఫీట్లు

గంభీరావుపేట(సిరిసిల్ల): నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టులోకి నెమ్మదిగా వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు సామర్థ్యం 31 అడుగులు కాగా ప్రస్తుతం 15 ఫీట్లకు నీటిమట్టం చేరింది.

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం

జిల్లాలో తేలికపాటి వర్షపు జల్లులు కురుస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కలెక్టర్ గారూ.. న్యాయం చేయండి



సిరిసిల్లటౌన్: 'నేను చచ్చేంత వరకు బాగా చూసుకుంటాడని ఆస్తిని రాసిస్తే తెగనమ్ముకుంటున్నాడు' అని ఓ వృద్ధుడు కలెక్టరేట్ మెట్లెక్కాడు. న్యాయం కావాలని బ్యానర్‌తో బైఠాయించాడు. బాధితుడు తెలిపిన వివరాలు. తంగళ్లపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన బత్తుల ఎల్లయ్యకు ఎవరూ లేరు. తన ఆలన..పాలన చూసుకుంటాడని ఊరిలో ఉన్న మూడెకరాల భూమిని వరుసకు మనుమడైన గోపాల్‌రావుపల్లెకు చెందిన కొండవేని ప్రశాంత్‌కు రాసిచ్చాడు. అయితే చాలా రోజుల క్రితం ఎకరం అమ్ముకున్నాడని, ఇప్పుడు మిగతా రెండు ఎకరాలను అమ్మేయాలని చూస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. మలిసంధ్యలో ఉన్న తనకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట స్నేహితుడితో పాటు బైఠాయించాడు. అధికారులు మాట్లాడి వృద్ధుడిని ఇంటికి పంపించారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల తనిఖీ



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలో నిర్మించిన కేసీఆర్‌నగర్‌కాలనీలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను గురువారం మండల అధికారులు తనిఖీ చేశారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతోష్, ఆఫీస్ సిబ్బందితో కలిసి డబుల్ ఇళ్లలో ఉంటున్న వారి వివరాలు తెలుసుకున్నారు. లబ్ధిదారులే ఉంటున్నారా? ఇతరులు అద్దెకు ఉంటున్నారా? అనే వివరాలపై ఆరా తీశారు. అయితే డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో 21 ఇళ్లు ఖాళీగా ఉన్నట్లు తెలిసింది. వాటిని అర్హులకు అందివ్వాలని స్థానికులు కోరుతున్నారు.

మైక్రోఫైనాన్స్‌లపై చర్యలు తీసుకోండి




సిరిసిల్లటౌన్: పైసల్లేకుండా పస్తులుంటున్న నేతకార్మికులపై మైక్రో ఫైనాన్స్‌లు, బంధన్ బ్యాంకులు రుణాలు చెల్లించాలని వేధిస్తున్నారని వస్త్రపరిశ్రమ, అనుబంధ రంగాల జేఏసీ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో చేపడుతున్న 11వ రోజు దీక్షలు ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా తేరుకుని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల ప్రకారం వస్త్ర పరిశ్రమను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. గురువారం దీక్షల్లో సిరిమల్లె సత్యం, దోమల రమేశ్, చింతకింది సుదర్శన్, ఆడెపు రఘు, బల్ల రాంచంద్రం, ప్రవీణ్, మహేశ్, కిషన్, సతీశ్, శ్యామ్ కూర్చున్నారు. గద్దర్ కూతురు వెన్నెల గద్దర్‌తోపాటు జేఏసీ ప్రతినిధులు మూశం రమేశ్, గోలి వెంకటరమణ, మోర రవి, ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, పంతం రవి, ఆడెపు భాస్కర్, తాటిపాముల దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య అకాడమీ యువ పురస్కారాలు

సిరిసిల్లకల్చరల్: సాహిత్య అకాడమీ గుర్తించిన 24 భాషల్లో భారతీయ యువ రచయితలు, ప్రచురణకర్తల నుంచి యువపురస్కారాల కోసం గ్రంథాలను ఆహ్వానిస్తోంది. 35 ఏళ్ల లోపు వయసు గల రచయితలు తమ గ్రంథాలను ఈనెల 31లోపు అందేలా పంపించాలని అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు. గ్రంథాలతోపాటు జనన ధ్రువీకరణపత్రం, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు కాపీలను పంపించాలని సూచించారు. పురస్కారానికి ఎంపికైన రచయితలకు రూ.50వేల నగదు, జ్ఞాపిక, అందజేయనున్నట్లు తెలిపారు. వివరాల కోసం అకాడమీ వెబ్‌సైట్ http://sahitya-akacemi.gov.in దర్శించాలని సూచించారు.

వేములవాడలో భారీ వర్షం



వేములవాడ: వేములవాడలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి కాస్త ఎండ, ఉక్కపోత ఉన్నా సాయంత్రం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణ ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది.

బిజినెస్ ఢీలా!

సిరిసిల్లటౌన్: పొద్దస్తమానం సాంచాల సప్పుడు.. గ్రామీణులు, పట్టణ ప్రజల షాపింగ్స్‌తో కళకలాడిన సిరిసిల్ల ఇప్పుడు ఢీలా పడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా వ్యాపారాలు మందగించాయి. సిరిసిల్లలో నేతకార్మికులకు ఎనిమిది నెలలుగా పనుల్లేక, చేసిన పనులకు కూలి డబ్బులు రాక ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటున్నారు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో పొలం పనుల్లో పెట్టుబడులకు రైతులు ఇబ్బందులు పడుతుండడం మార్కెట్‌పై ప్రభావం చూపుతుంది. సిరులఖిల్లాలో వ్యాపారాలు తగ్గుముఖం పట్టిన వైనంపై 'సాక్షి' స్పెషల్ స్టోరీ..

- నేతన్నలకు పనులు కరువు..
- పొలం పనుల్లో కర్షకులు
- మందగించిన వ్యాపారాలు
- మూతపడ్డ చాయ్ హోటళ్లు, కిరాణాషాప్స్

సాక్షి స్పెషల్ స్టోరీ



గిరాకీ లేక వెలవెలబోతున్న సిరిసిల్లలోని మటన్ మార్కెట్



ఇది జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్‌లోని కంకటి భాను అనే నేత కార్మికుడి హోటల్, పక్కనే కిరాణా టేలా. సిరిసిల్లలో సాంచాలు నడిచిన రోజుల్లో ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 2 గంటల వరకు నిరంతరాయంగా కుటుంబ సభ్యులతో కలిసి నడిపేవాడు. ప్రతిరోజు సుమారు 200 చాయ్‌లు, రూ.2వేల వరకు కిరాణా షాపులో గిరాకీ అయ్యేది. ఇప్పుడు నేతకార్మికులకు పనుల్లేక ఇలా రెండు చిన్న వ్యాపారాలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి.



వెలవెలబోతున్న బట్టల దుకాణం



కిరాణదుకాణంలో అరకొర గిరాకీ

వ్యాపార సంక్షోభం

కార్మికక్షేత్రం సిరిసిల్లలో ప్రధాన ఆదాయవనరు వస్త్రోత్పత్తి రంగం. దీనిపై ఆధారపడి జనాభాలో ఎనభైశాతం మంది జీవనం సాగిస్తున్నారు. వస్త్రోత్పత్తి రంగం బాగా నడిస్తేనే ఇక్కడ ఇతర రంగాలు నడుస్తాయి. ఏడు నెలలుగా వస్త్ర ఉత్పత్తి జరుగక నేతకార్మికులు, ఆసాములు, అనుబంధ రంగాల కార్మికుల వద్ద డబ్బుల్లేక కాలం వెల్లదీస్తున్నారు. ఇక చుట్టుపక్కల పల్లెల్లో వ్యవసాయరంగంలో పెట్టుబడులకు రైతులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. అటు వ్యవసాయం, ఇటు వస్త్రోత్పత్తి రంగాలు ఆర్థిక సంక్షోభాన్ని చవిచూడటంతో అన్ని వ్యాపారాలు ఖాయిలా పడ్డాయి.

ఇదీ పరిస్థితి..

- సిరిసిల్లలో ప్రతీ ఏడాది మొదట్లో బతుకమ్మ తదితర ప్రభుత్వ ఆర్డర్లు వచ్చేవి. ఈఏడాది రాకపోవడం, ప్రభుత్వం నుంచి బకాయిలు పూర్తిగా మంజూరుకాకపోవడంతో పరిశ్రమ ఆర్థికమాంద్యంతో బంద్ పడింది.
- పల్లెల్లో వ్యవసాయ పనులు జోరందుకోవడంతో రైతులు పెట్టుబడులకే ఇబ్బంది పడుతున్నారు. ఈతరుణంలో సిరిసిల్లకు రావడం లేదు. ఫలితంగా వ్యాపారాలు సాగడం లేదు.
- ఇక నిరుపేద వర్గాల పిల్లలకు స్కూలు ఫీజులు, సీజనల్ వ్యాధులతో చికిత్సకు డబ్బులు అవసరమై ఖర్చులు కూడా అదుపులో పెడుతున్నారు.
- రోజువారి కూలీ చేసుకునే వారి పరిస్థితి దైన్యంగా మారింది. చేతిలో పైసల్లేక, బయట అప్పుపుట్టక కుటుంబాలను కష్టంగా వెళ్లదీస్తున్నారు.
- నేతకార్మికులు ఉదయం, రాత్రి షిఫ్టుల్లో పనిచేస్తూ..ఉపశమనం కోసం చాయ్‌లు సేవించేవారు. పనుల్లేక కార్మికవాడల్లో హోటళ్లు మూతపడ్డాయి.
- సినిమాహాళ్లు, పెట్రోల్‌బంక్‌లు, తదితర వ్యాపారాలపై తీవ్ర ప్రభావం పడింది.

సగానికి పైగా గిరాకీ తగ్గింది



సిరిసిల్లలో మటన్ వ్యాపారం సగానికి పైగా తగ్గింది. మార్కెట్లో 30 మందిమి రోజుకు ఒక్కో యాటను అమ్మేటోళ్లం. ఇప్పుడు పదిహేను అమ్మడం గగనమైతుంది. వస్త్రపరిశ్రమ బంద్, పల్లెలో రైతులకు పెట్టుబుడులకు ఇబ్బందులతో గిరాకీ తగ్గిపోయింది. పండుగలు, పబ్బాలకు మటన్ కాకుండా చికెన్‌తో సరిపెట్టుకుంటున్నారు. ఆదివారం మటన్, బోటి, తలకాయ, కాళ్లకు గిరాకి పడిపోయింది.

– గజభీంకార్ మధు, మటన్ వ్యాపారి

కొనుగోళ్లు తగ్గించారు



మా ఏరియాలో నేతకార్మికులతోనే వ్యాపారం సాగేది. గతంలో కిలో కందిపప్పు కొనేటోళ్లు ఇప్పుడు అర్ధపావు అడుగుతుండడం చూస్తున్నాం. వ్యాపారం నూటికి 60శాతం తగ్గింది. వారానికి ఒకసారి పగార్లు రాగానే కట్టేటోళ్లు. ఇప్పుడు వాళ్ల దగ్గర పైసల్లేవు. మేము వాళ్లకు ఎక్కువ ఉద్దెర ఇచ్చే పరిస్థితి లేదు. చాలా చిన్న దుకాణాలు, హోటల్స్ బందుపడ్డాయి.

– చౌటపెల్లి నర్సయ్య, గణేష్‌నగర్ కిరాణా షాపు

ప్రీమియం గిరాకీ తగ్గింది



సిరిసిల్లలో వ్యాపారాలు తగ్గినయి. మా వద్ద రూ.500లోపు వస్త్రాలకు మంచి డిమాండ్ ఉండేది. ఆఫర్స్ పెట్టినా విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. మధ్యతరగతి, ఉన్నత తరగతి వారు షాపింగ్‌కు వస్తున్నారు. సిరిసిల్లలో మాంద్యం పెళ్లిళ్ల సీజన్‌పై పడేలా ఉంది. పని ఇస్తారా అంటూ ప్రతిరోజు ఎవరో ఒకరు వస్తున్నారు. సిరిసిల్లలో వ్యాపారం 60శాతానికి తగ్గింది.

– రాజూరి వంశీ, బట్టల షోరూం యజమాని

పాలవ్యాపారం పడిపోయింది



నేను సాధారణ రోజుల్లో నిత్యం 500 లీటర్ల పాలు హోటళ్లు, కిరాణా షాపులకు సప్లయ్ చేసేది. ఇప్పుడు 350 లీటర్లు మాత్రమే ఇస్తున్నా. మనీ సర్క్యులేషన్ లేక ఉద్దెర ఇవ్వలేని పరిస్థితి. మేము డెయిరీలో నగదు పెట్టి తెస్తాం. నాకు ఉన్నదానిలో ఉద్దెర ఇచ్చాను. నేత కార్మికులకు పని ఉంటే ఎప్పటికప్పుడు పైసలు పెట్టి కొనేటోళ్లు. వాళ్ల దగ్గర పైసల్లేకుండా ఇంట్లో చాయ్‌లు కూడా తగ్గించారు.

– గాలి శ్రీనివాస్, పాల వ్యాపారి

ప్యాకేజీలుగా 'ఎన్‌హెచ్ 563'

- జగిత్యాల–గంగాధర 28 కి.మీ.కు రూ.848 కోట్లు
- గంగాధర–కరీంనగర్ బైపాస్ వరకు 30.9 కి.మీ.కు రూ.893 కోట్లు
- డిసెంబర్ లేదా జనవరిలో ఫోర్‌లేన్ రహదారి పనులు ప్రారంభం
- పలు సివిల్ ఇన్‌ఫ్రా కంపెనీలు టెండర్లు వేస్తున్నట్లు సమాచారం



గట్టుదుద్దెనపల్లి వద్ద టోల్‌గేట్ పనులు (ఫైల్)

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ప్రతిష్టాత్మక ఎన్‌హెచ్–563 జగిత్యాల–కరీంనగర్ సెక్షన్ ఫోర్ లేన్ రహదారి పనులకు దేశవ్యాప్తంగా పలు సివిల్ ఇన్‌ఫ్రా కంపెనీలు టెండర్లు వేస్తున్నట్లు సమాచారం. వచ్చే నెలలో అధికారులు టెండర్లు ఓపెన్ చేసి, ఖరారు చేయనున్నారు. డిసెంబర్ లేదా జనవరిలో పనులు ప్రారంభంకానున్నాయి. ఈమేరకు ముందస్తుగా రూపొందించిన ప్రణాళిక ప్రకారం అధికారులు ముందుకుసాగుతున్నారు. ఇప్పటికే ఈ పనులపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ పర్యవేక్షిస్తున్నారు. వరంగల్–కరీంనగర్ సెక్షన్‌లో ఇప్పటికే పనులు ఊపందుకున్నాయి. పలుచోట్ల కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వాటిని ఇటీవల కోర్టు డిస్పోజ్ చేసింది. దీంతో వారంతా తిరిగి ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిసింది.

పని విభజన..

తాజా సమాచారం ప్రకారం.. ఈ రహదారిలో రెండు కీలక(వరంగల్–కరీంనగర్ సెక్షన్ 68 కి.మీ, కరీంనగర్–జగిత్యాల సెక్షన్ 58.9 కి.మీ) సెక్షన్లు ఉన్నాయి. జగిత్యాల–కరీంనగర్ సెక్షన్‌లో పనులు రెండు ప్యాకేజీలుగా విభజించారు. మొదటిది జగిత్యాల నుంచి గంగాధర వరకు 28 కి.మీ. దూరం. దీన్ని పూర్తి చేయడానికి రూ.848.56 కోట్లు ఖర్చు చేయనున్నారు. రెండోది గంగాధర–కరీంనగర్ బైపాస్(కొత్తపల్లి శివారు) వరకు 30.9 కి.మీ. దూరం. దీన్ని పూర్తి చేసేందుకు రూ.893.79 కోట్లు వెచ్చించనున్నారు. మొత్తంగా ఒకే సెక్షన్‌లోని పనులను విభజించి, రెండు కంపెనీలకు టెండర్లు ఇవ్వాలన్నది అధికారుల వ్యూహంగా కనిపిస్తోంది. రహదారి పనులు వచ్చే ఏడాది జూలై 16 నాటికి పూర్తి చేయాలన్న సంకల్పంతో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) అధికారులు ఉన్నారు. డిజైన్, బిల్డ్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్(డీబీవోటీ) విధానంలో రోడ్డు నిర్మాణం చేపడతారు.

పూడూరు సమీపంలో టోల్‌గేట్..

కరీంనగర్–జగిత్యాల సెక్షన్‌లో ఇప్పటికే టెండర్లు తెరుచుకున్నాయి. మొత్తం 58.9 కి.మీ. మేర రహదారికి రూ.222,7 కోట్లు ఖర్చవనుంది. ఇందులో భూసేకరణకు కోసం రూ.387.15 కోట్లు వెచ్చించనున్నారు. వాస్తవానికి ఈ రహదారి నిర్మాణ అంచనా వ్యయం రూ.1,503.73 కోట్లు మాత్రమే. దీనికి జీఎస్టీ, భూసేకరణ కలుపుకొని రూ.2,227 కోట్లకు చేరింది. ఈ క్రమంలో పూడూరు సమీపంలో టోల్‌గేట్ నిర్మిస్తున్నారు. తొలుత గంగాధర సమీపంలో నిర్మిస్తారని ప్రచారం జరిగింది. టోల్‌గేట్ సమీపంలో ఇరువైపులా ట్రక్కులు ఆగేలా ట్రక్ బే, రెస్ట్ ఏరియాలు నిర్మించనున్నారు. 24 బ్రిడ్జిలు (18 మైనర్, 06 మేజర్), 03 ఆర్వోబీ/ఆర్‌యూబీ, 27 మేజర్ జంక్షన్లు, 29 మైనర్ జంక్షన్లు కూడా నిర్మించనున్నారు.

తల్లిపాల విశిష్టతను గుర్తించాలి



తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

సిరిసిల్ల: తల్లిపాల విశిష్టతను అందరూ గుర్తించాలని, శిశువుకు తల్లి పాలే శ్రీరామరక్ష అని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. ఈనెల 1 నుంచి 7 వరకు నిర్వహించే తల్లిపాల వారోత్సవాలను జిల్లా జనరల్ ఆస్పత్రిలో గురువారం ప్రారంభించి మాట్లాడారు. తల్లిపాల విశిష్టతపై విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని గర్భిణీలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించాలన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు ఆరు నెలల వరకు తల్లి పాలను మాత్రమే ఆహారంగా అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని బాలింతలకు కలెక్టర్ పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆస్పత్రి పరిసరాలు పరిశీలించారు. సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వసంతరావు, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, మున్సిపల్ కమిషనర్ లావణ్య, ఆస్పత్రుల సమన్వయకర్త పి.పెంచలయ్య, ఆర్ఎంవోలు సంతోష్, కాశీనాథ్, వైద్యులు నాగార్జున, సాయి, సీడీపీవోలు అలేఖ్య, ఎల్లయ్య, స్థానిక కౌన్సిలర్ గుండ్లపల్లి నీరజ పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులు పల్లెల్లో పర్యటించాలి

ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యటించాలని, పనులను పర్యవేక్షించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల ఉన్నతాధికారులతో గురువారం సమీక్షించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త వేరు చేసి ఇచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలన్నారు. వర్షాలు కురుస్తున్నందునా నీటిని క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు. జెడ్పీ సీఈవో ఉమారాణి, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఎల్.రమేశ్, రాజేశ్వర్, డీఆర్డీవో శేషాద్రి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, డీపీవో వీరబుచ్చయ్య, జిల్లా వైద్యాధికారి వసంతరావు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేశ్, ఎస్డీసీ రాధాభాయ్, ఎస్సీ సంక్షేమాధికారి విజయలక్ష్మి, డీఏవో భాస్కర్, మిషన్ భగీరథ ఈఈలు విజయ్‌కుమార్, జానకి పాల్గొన్నారు.

కోడెలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

వేములవాడఅర్బన్: వర్షాకాలంతో రాజన్న గోశాలలోని కోడెలు, ఆవులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలను గురువారం తనిఖీ చేశారు. గోశాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గోశాలలో ఎంతమంది సిబ్బంది, వైద్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

చిన్నారులకు పోషకాహారం అందించాలి

వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. అనంతరం సమీపంలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ఇంగ్లిష్, మ్యాథ్స్ సబ్జెక్టుల్లోని ప్రాథమికాంశాలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

5 నుంచి స్వచ్ఛదనం..పచ్చదనం

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

సిరిసిల్ల: మొక్కల లక్ష్యాన్ని చేరుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుంచి గురువారం అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈనెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం..పచ్చదనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు పచ్చదనం పెంపే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. 5న స్వచ్ఛదనం..పచ్చదనం ప్రారంభం, 6న తాగునీటి సరఫరా, ఇంకుడు గుంతల నిర్మాణం, 7న మురికికాల్వలు, నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేయడం, గుంతలు పూడ్చడం, 8న సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన, వీధికుక్కల దాడుల నివారణ చర్యలు, 9న డ్రై డే, ప్రభుత్వ సంస్థలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమం నిర్వహణకు అధికారులను నియమించాలని తెలిపారు. ప్రతీ నెలలో మూడో శనివారం స్వచ్ఛదనం..పచ్చదనం దినంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా వైద్యాధికారి వసంతరావు, డీఈవో రమేశ్‌కుమార్, డీపీవో వీరబుచ్చయ్య, కమిషనర్లు లావణ్య, అన్వేశ్ పాల్గొన్నారు.

స్వీయరక్షణ విధానాలు నేర్చుకోవాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- ఆపరేషన్ జ్వాల–2 శిక్షణ



విన్యాసాలు వీక్షిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఆపద సమయంలో తమను తాము రక్షించుకునేందుకు మహిళలు స్వీయరక్షణ విధానాలు నేర్చుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి మోడల్ స్కూల్‌లో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ జ్వాల–2 కార్యక్రమం గురువారం నిర్వహించారు. విద్యార్థినిలకు సెల్ఫ్ డిఫెన్స్ గురించి వివరించారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ ఆపరేషన్ జ్వాలలో భాగంగా జిల్లాలోని 2వేల మంది విద్యార్థినులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణతో విద్యార్థినిలు ఆపద సమయంలో ధైర్యంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుందన్నారు. చైన్‌స్నాచింగ్, లైంగికదాడులు జరిగే క్రమంలో వాటిని సమర్థంగా ఉపయోగపడుతుందని వివరించారు. ఎలాంటి వేధింపులకు గురైనా నిర్భయంగా ముందుకొచ్చి జిల్లా షీటీమ్, డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఏఎస్పీలు శేషాద్రినిరెడ్డి, చంద్రయ్య, సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ సీఐ మొగిలి, తంగళ్లపల్లి ఎస్ఐ డి.సుధాకర్ పాల్గొన్నారు.



సీఎం వ్యాఖ్యలపై నిరసన

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ నిరసనలు ఎగసిపడ్డాయి. అసెంబ్లీలో సబితా ఇంద్రారెడ్డి, సునీతలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్, ఆ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈక్రమంలో బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బొల్లి రామ్మోహన్, గుండ్లపెల్లి పూర్ణచందర్, కుంబాల మల్లారెడ్డి, మాట్ల మధు, గద్దం లత, పూసవెల్లి సరస్వతి, గుండ్లపెల్లి నీరజ, కోడి అంతయ్య, దార్ల సందీప్, అన్నారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనారోగ్యంతో గల్ఫ్ కార్మికుడు మృతి



పెండ్యాల శ్రీకాంత్ (ఫైల్)

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం నూకలమర్రికి చెందిన గల్ఫ్ కార్మికుడు పెండ్యాల శ్రీకాంత్(55) అనారోగ్యంతో అబుదాబిలో మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ఉపాధి కోసం వెళ్తున్న ఆయన అక్కడే ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రిలో చేరారు. పరిస్థితి విషమించడంతో జూలై 29న ఆసుపత్రిలో మృతిచెందినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డెంగీతో మహిళ మృతి

- మర్రిగడ్డలో విషాదం



అంజలి(ఫైల్)

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం మర్రిగడ్డకు చెందిన గజవాడ అంజలి(53) డెంగీతో గురువారం మృతిచెందింది. అంజలి ఐదు రోజుల క్రితం అనారోగ్యం బారిన పడగా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి డెంగీతోపాటు ఊపిరితిత్తుల్లో నీరు చేరిందని తెలిపారు. దీంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలుకు భర్త జనార్దన్, కూతురు, కుమారుడు ఉన్నారు.

విద్యార్థికి డెంగీ

ముస్తాబాద్(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన మీస రోహిత్ డెంగీతో బాధపడుతున్నాడని వైద్యాధికారి గీతాంజలి తెలిపారు. సిద్దిపేట జిల్లా పాలమాకుల మోడల్‌స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న రోహిత్‌కు హాస్టల్‌లో ఉండగానే జ్వరం బారిన పడ్డాడు. తల్లిదండ్రులు గురువారం పోతుగల్ పీహెచ్‌సీకి తీసుకురాగా.. పరీక్షించిన వైద్యులు డెంగీగా నిర్ధారించారు. రోహిత్‌కు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. రోహిత్ ఇంటి వద్ద గురువారం వైద్యసిబ్బంది దోమల నివారణకు మందులు పిచికారీ చేయించారు. సూపర్‌వైజర్లు ఫయాజ్, వెంకటాచారి, ఏఎన్‌ఎంలు ధనలక్ష్మి, కొల్లూరు రేణుక, ఆశవర్కర్లు రేణుక, జ్యోతి ఉన్నారు.

బుగ్గారం ఏఎస్సై సస్పెన్షన్

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా బుగ్గారం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై లక్ష్మీనారాయణ ఎస్సైతోపాటు తోటి సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించాడన్న ఫిర్యాదు మేరకు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆయనను సస్పెండ్ చేస్తూ గురువారం మల్టీ జోన్ –1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

పోయిన ప్రాణం..పట్టని అధికార గణం

- వీధికుక్కల స్వైరవిహారం
- ముందే హెచ్చరించిన సాక్షి
- పట్టించుకోని అధికారులు
- నిద్రిస్తున్న వృద్ధురాలిపై కుక్కల దాడి
- బట్టోనితాళ్లలో విషాదం



రోదిస్తున్న కుటుంబీకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లాలో వీధికుక్కల దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతీ ఒక్కరు బాధితులే. ముస్తాబాద్ మండలం బట్టోనితాళ్లలో మనసును కలచివేసే సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. అచేతన..అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వృద్ధురాలిపై కుక్కల గుంపు దాడి చేసి కొరికి చంపేయడం జిల్లాలో కలకలం రేపింది. జిల్లాలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని మూడు రోజుల క్రితమే 'సాక్షి' హెచ్చరించింది. అయినా అధికారుల్లో చలనం రాలేదు. కుక్కల నివారణ చర్యలను గాలికొదిలేశారు. ఫలితంగా ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి.

బట్టోనితాళ్లలో భయాందోళన

ముస్తాబాద్ మండలం సేవాలాల్‌తండా పంచాయతీ పరిధిలోని బట్టోనితాళ్లకు చెందిన వృద్ధురాలు పిట్ల రామలక్ష్మి(85)ని కుక్కలు కొరికి చంపేయడంతో గ్రామంలో భయాందోళనలు మొదలయ్యాయి. గ్రామంలో ఒంటరిగా బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. రామలక్ష్మి చనిపోయిన గదిలో భీతావహ వాతావరణం ఉండడంతో ఆ పరిస్థితులను చూసిన వారి ఇంకా షాక్ నుంచి తేరుకోలేదు. కుక్కల దాడి చేసి ముఖం, చేతులు, పొట్టభాగాలను చీల్చివేయడంతో గది రక్తం మరకలు, మాంసపు ముద్దలతో భయానకంగా ఉంది. ఇది చూసిన గ్రామస్తులు కుక్కలను చూస్తేనే భయపడుతున్నారు. గ్రామంలో కుక్కలను నివారించాలని అధికారులను వేడుకుంటున్నారు.

వరుస సంఘటనలు

- ఏడాది క్రితం ముస్తాబాద్‌లో ఉంటున్న గుజరాత్‌కు చెందిన చిన్నారిపై కుక్కలు దాడి చేసి ముక్కు, చెంపలను కొరికివేశాయి.
- రెండేళ్ల క్రితం ఆవునూర్‌లో ఓ వృద్ధురాలిని కుక్కలు కరవగా, ఆమె ముక్కు పోయింది. చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతిచెందింది.

కుక్కల నివారణకు డిమాండ్

జిల్లాలో కుక్కల నివారణకు డిమాండ్ పెరుగుతోంది. వీధికుక్కలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నా పంచాయతీ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిరిసిల్లలోని జంతు జనన నియంత్రణ కేంద్రం మూతపడింది. గతేడాది జిల్లాలో కుక్కకాటుకు గురైన బాధితులు 5,708 మంది ఉన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 3,359 మంది కుక్కకాటు బాధితులు ఉన్నారు. బట్టోనితాళ్ల సంఘటనతో జిల్లాలో వీధి కుక్కల బెడదపై చర్చ సాగుతోంది. వీధికుక్కలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్న డిమాండ్ తెరపైకి వస్తుంది.



సాక్షిలో ప్రచురితమైన కథనం

అక్రమ కేసులు ఎత్తివేయాలి



సిరిసిల్లకల్చరల్: విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సిరిసిల్లకల్చరల్/వేములవాడ: కోర్టు ఉత్తర్వులను లెక్కలోకి తీసుకోకుండా సీనియర్ న్యాయవాది సురభి సత్యనారాయణరావు భూమి విషయంలో పోలీసులు అక్రమ కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ సిరిసిల్ల న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. సత్యనారాయణరావుకు అంకిరెడ్డిపల్లెలో వ్యవసాయ భూమి ఉంది. ఇదే భూమికి ఆనుకొని ఓ కాంగ్రెస్ నాయకుడి సతీమణికి ప్రభుత్వం ప్రోత్సాహకంగా కేటాయించిన భూమి ఉంది. తన భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని సత్యనారాయణ కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నారు. పోలీసులను ఆశ్రయించి రక్షణ కోరిన సత్యనారాయణరావు పట్ల తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సుధాకర్ రెండు కేసులు నమోదు చేశారు. ఈ మేరకు బార్‌అసోసియేషన్ విధుల బహిష్కరణకు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు దోర్నాల సంజీవరెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులకు పోలీసులకు మధ్య సమన్వయం ఉండాలని, కోర్టు ఉత్తర్వులను పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వేములవాడ: సిరిసిల్ల సీనియర్ న్యాయవాది సురభి సత్యనారాయణరావుపై ఠాణాలో అక్రమ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ వేములవాడలో న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం మాట్లాడారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రజనీకాంత్, న్యాయవాదులు నక్క దివాకర్, పురుషోత్తం, గుండా రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై దళిత సంఘాల హర్షం



అంబేడ్కర్ విగ్రహానికి నాయకుల నివాళి

సిరిసిల్లకల్చరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై పట్టణ బార్ అసోసియేషన్ కార్యదర్శి తంగళ్లపల్లి వెంకటి హర్షం వ్యక్తంచేశారు. వర్గీకరణకు అనువుగా వ్యవహరించిన కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు. రానున రోజుల్లో విద్య, ఉద్యోగ అవకాశాల్లో యువతకు అవకాశం కల్పించాలని కోరారు.

ముస్తాబాద్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నివ్వడంపై దళిత సంఘాల నాయకులు సంబరాలు నిర్వహించారు. మండలకేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు సడిమెల ఎల్లం, దుబ్బాక రాజు మాట్లాడారు. ఎన్నో ఉద్యమాలు, పోరాటాలతో ఎస్సీ వర్గీకరణ సాధించుకున్నామన్నారు. దళితసంఘాల నాయకులు మాజీసర్పంచ్ నల్ల నర్సయ్య, రాజు, చంచు మల్లయ్య, మీస శంకర్, వెంకటేశ్, రాజు, శ్రీను, మల్లేశం, శ్రీకాంత్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో మండల ఎమ్మార్పీఎస్ నాయకులు మండలకేంద్రంలో సంబరాలు నిర్వహించారు. మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కాసుపాక శంకర్, రాష్ట్ర నాయకుడు గుండేటి రాజు, మండల అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు తడుక పెళ్లి భూమయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ ఇవ్వని రైస్ మిల్ యజమాని అరెస్ట్

- రూ.3.10 కోట్ల విలువైన బియ్యం పక్కదారి
- జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ వెల్లడి



మాట్లాడుతున్న డీఎస్పీ రఘు చందర్

మల్యాల: ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తీసుకుని.. సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ఇవ్వకుండా అక్రమాలకు పాల్పడిన రైస్‌మిల్ యజమానిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. మండల కేంద్రంలోని సీఐ కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. పెగడపల్లి శివారులోని హరిహర రైస్‌మిల్ యజమాని గంగం వెంకట్‌రెడ్డి సివిల్ సప్లై కార్పొరేషన్‌తో ధాన్యాన్ని బియ్యంగా మార్చి అప్పగించేందుకు 2022–23 సంవత్సరానికి గాను ఒప్పందం చేసుకున్నాడు. సుమారు రూ.3,10,82,310 విలువైన 12,728.74 క్వింటాళ్ల బియ్యం ఇవ్వాల్సి ఉండగా.. అక్రమాలకు పాల్పడినట్లు కార్పొరేషన్ జిల్లా మేనేజర్ వి.హథిరామ్ పెగడపల్లి ఎస్సై రవికిరణ్‌కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా నిబంధనలు ఉల్లంఘించి, సీఎంఆర్‌లో అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. దీంతో మిల్లు యజమానిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి, పెగడపల్లి ఎస్సై సీహెచ్. రవికిరణ్ పాల్గొన్నారు.

హైకోర్టును ఆశ్రయించిన బుధవారంపేట గ్రామస్తులు

రామగిరి(మంథని): తమకు సంక్షేమ పథకాలు అమలయ్యేలా, పరిహారం అందేలా చూడాలని కోరుతూ బుధవారంపేట గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించారు. నిర్వాసితుల కథనం ప్రకారం.. ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2 విస్తరణ కోసం రాజాపూర్ గ్రామానికి చెందిన 218 మంది రైతుల నుంచి 708 ఎకరాలు సేకరించడానికి సింగరేణి నిర్ణయించింది. ఇందుకోసం 2009లో డ్రాఫ్ట్ డిక్లరేషన్ ప్రకటించింది. 2011లో నోటిఫికేషన్ జారీచేసి 2015లో అవార్డు జారీచేసింది. దీంతో రైతుల భూములు సింగరేణి స్వాధీనం చేసుకున్నట్లు పరిగణించింది. కానీ, పరిహారం విషయంలో గతంలో కొందరు హైకోర్టును ఆశ్రయించగా 2022లో అవార్డు రద్దు చేస్తూ, రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేయాలని కోర్టు తీర్పు ఇచ్చింది. ఇక తమ కష్టాలు తీరుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ, మరో 88 ఎకరాల భూ సేకరణకు సింగరేణి నోటిఫికేషన్ జారీచేసింది. అయితే, భూములతోపాటు తమ ఇళ్లను కూడా స్వాధీనం చేసుకుంటేనే సింగరేణికి సహకరిస్తామని రాజాపూర్ గ్రామస్తులు తెలిపారు. తమకు పరిహారం అందకపోవడంతోపాటు పట్టాదారులుగా గుర్తించకపోవడంతో రైతు బంధు, రైతు బీమా, పీఎం కిసాన్, క్రాఫ్‌లోన్‌లు వంటి సంక్షేమ పథకాలు పొందలేకపోయామని బుద్దార్థి బుచ్చయ్యతోపాటు 15 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఈవిషయాలపై అడ్వకేట్ పోనంపల్లి రవి రిట్‌పిటిషన్ వేయగా గురువారం సింగిల్‌బెంచ్ ధర్మాసనం విచారించింది. సమస్యలు విన్న హైకోర్టు.. రికార్డుల్లో రైతుల పేర్లు ఎందుకు చేర్చలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించినట్లు అడ్వకేట్ తెలిపారు. ఈమేరకు నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని, లేకుంటే రిట్ పిటిషన్‌కు అను మతి ఇస్తూ ప్రభుత్వానికి జరిమానా విధిస్తామని ధర్మాసనం వెల్లడించినట్లు అడ్వకేట్ వివరించారు.

అటవీ శాఖలో పలువురి బదిలీలు

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్‌వో)గా షౌకత్ హుస్సేన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకు ఎఫ్ఆర్వోగా ఉన్న శ్రీనివాస్‌రెడ్డిని ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేసింది. అలాగే, గంగాధర డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కిరణ్మయిని స్ట్రైకింగ్ ఫోర్స్‌కు కేటాయించగా, ఆమె స్థానంలో సిరిసిల్ల డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బాపిరాజును నియమించింది. చొప్పదండి ఎఫ్ఎస్‌వో భరణిని కామారెడ్డి బదిలీ చేసింది.

సీపీవో కార్యాలయంలో..

సీపీవో కార్యాలయంలో పనిచేసే డిప్యూటీ ఎస్‌వోలు శ్రీనివాస్ హైదరాబాద్‌కు, సంపత్ సిద్దిపేటకు, రాంప్రసాద్‌రెడ్డి సెక్రటేరియట్‌కు, జమ్మికుంట ఎంపీఎస్‌వో హైమావతి హైదరాబాద్‌కు, సీనియర్ అసిస్టెంట్ సునంద సిరిసిల్లకు, జ్యోతి(కరీంనగర్ ఆర్డీవో ఆఫీస్)ను సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌కు, ఉమారాణి(హైదరాబాద్), అంజయ్య(సిరిసిల్ల)లను కరీంనగర్ సీపీవో కార్యాలయానికి బదిలీ చేశారు. వాసుదేవరెడ్డి(హైదరాబాద్)ని కరీంనగర్ ఆర్డీవో కార్యాలయానికి, సీనియర్ అసిస్టెంట్ హేమలత(సిరిసిల్ల)ను కరీంనగర్‌కు, ఎంపీఎస్‌వో రమేశ్(సిరిసిల్ల)ను జమ్మికుంటకు కేటాయించారు.

గ్యాస్ ఏజెన్సీ సీజ్

పాలకుర్తి(రామగుండం): కుక్కలగూడూరు శివారులోని సూర్య గ్యాస్ ఏజెన్సీని గురువారం సీజ్ చేసినట్లు సివిల్ సప్లయ్ జిల్లా అధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేసేందుకు వచ్చిన తమకు సంబంధిత యజమాని సహకరించకపోవడంతో గోదాం సీజ్ చేశామన్నారు. శుక్రవారం మరోసారి తనిఖీ చేస్తామని తెలిపారు.

కుక్కల దాడిలో నలుగురికి గాయాలు



గాయాలతో చిన్నారి హజారా బేగం

రాయికల్: రాయికల్‌లో గురువారం పిచ్చికుక్కలు స్వైర విహారం చేశాయి. ఆర్నెళ్ల చిన్నారి హజారే బేగం, బద్దం రమ, తోకల లక్ష్మీనర్సయ్య, చిర్ర రమేశ్‌పై దాడి చేశాయి. వారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించి వ్యాక్సినేషన్ వేయించారు. ఒకే రోజు నలుగురిపై కుక్కలు దాడి చేయడంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకుల రిమాండ్



గంజాయి సేవిస్తూ పట్టుబడ్డ యువకులను అరెస్టు చూపుతున్న చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు

చందుర్తి(వేములవాడ): గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను చందుర్తి మండలం మూడపల్లి శివారులో సీఐ వెంకటేశ్వర్లు గురువారం అరెస్టు చేసినట్లు తెలిపారు. చందుర్తి సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మూడపల్లి శివారులో ఇద్దరు యువకులు గంజాయి సేవిస్తున్నారన్న సమాచారంతో దాడి చేయగా.. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లెకు చెందిన చీకుంట గణేశ్, కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన చిట్కూరి ఈశ్వర్ పట్టుబడ్డారు. వీరిని రిమాండ్‌కు తరలించారు.

'విప్'ను కలిసిన జిల్లా నాయకులు



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో నాయకులు

వేములవాడరూరల్: వేములవాడరూరల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను గురువారం అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న స్థానికసంస్థల ఎన్నికలు, మార్కెట్ కమిటీ నామినేటెడ్ పదవులపై సీనియర్లకు అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. ఈవిషయంలో మండల స్థాయి నాయకులు కలిసి చర్చించుకోవాలని ఆది శ్రీనివాస్ సూచించినట్లు సమాచారం. బొడ్డు రాములు, బండ శ్రీనివాస్‌యాదవ్, బత్తిని ఎల్లగౌడ్, నల్ల తిరుపతిరెడ్డి, చింతల కోటి రాజు, నాగుల విష్ణుప్రసాద్, దానె వేణు, కొంపల్లి శ్రీకాంత్, వేణు, తిరుపతి, ప్రశాంత్‌కుమార్, సురేశ్ ఉన్నారు.

కోతులదాడిలో వృద్ధురాలికి గాయాలు

చందుర్తి(వేములవాడ): మండలంలోని మల్యాలకు చెందిన వృద్ధురాలు సిర్రం మల్లవ్వ(65) గురువారం తీవ్రంగా గాయపడింది. కోతుల దాడి నుంచి తప్పించుకునే క్రమంలో కిందపడడంతో మోకాలు తుంటి విరిగింది. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కోతుల దాడులతో గ్రామస్తులు భయాందోళనలో ఉన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

సిరిసిల్ల: జిల్లాలో గురువారం మోస్తరు వర్షం కురిసింది. రుద్రంగిలో అత్యధికంగా 22.7 మిల్లీమీటర్లు, చందుర్తిలో 20.4, వేములవాడ రూరల్‌లో 13.8, బోయినపల్లిలో 5.5, వేములవాడలో 5.7, సిరిసిల్లలో 1.7, కోనరావుపేటలో 18.4, వీర్నపల్లిలో 17.8, ఎల్లారెడ్డిపేటలో 2.5, గంభీరావుపేటలో 0.9, ముస్తాబాద్‌లో 2.2, తంగళ్లపల్లిలో 1.6, ఇల్లంతకుంటలో 3.3 మిల్లీ మీటర్ల వర్షం పడింది.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్‌బియ్యం

గోదావరిఖని: పట్టణంలోని రమేశ్‌నగర్‌లో అక్రమంగా నిల్వచేసిన 4.27క్వింటాళ్ల రేషన్ బియ్యం, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 13 గృహ సిలిండర్లను పట్టుకున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. గురువారం రమేశ్‌నగర్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. టి.సత్యం అనే వ్యక్తి వద్ద 4.27 క్వింటాళ్ల రేషన్ బియ్యం, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న రెండు గ్యాస్ సిలిండర్లను, అదే సమయంలో రాజవీరు అనేవ్యక్తి వద్ద 11 గ్యాస్ సిలిండర్లు పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

మహిళపై అసభ్య ప్రవర్తన

- యువకులను చితకబాదిన స్థానికులు
- పోలీసులకు అప్పగింత



యువకులను చితకబాదుతున్న స్థానికులు

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని దేవునిగోవిందుపల్లిలో నివాసముంటున్న ఓ మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురు యువకులను స్థానికులు చితకబాది పోలీసులకు అప్పగించారు. దేవునిగోవిందుపల్లిలో ఓ మహిళ అద్దెకుంటోంది. గురువారం సాయంత్రం ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. స్థానికులు వారిని పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు.

అప్పు తీసుకోవడం.. ఐపీ పంపడం !

- జిల్లాలో ఇటీవల పెరిగిన ఐపీ నోటీస్‌ల కల్చర్
- వరుస సంఘటనలతో ఆందోళన
- రోడ్డున పడుతున్న రుణదాతలు
- సామాన్యులకు అప్పు పుట్టని వైనం



వేములవాడ: అవసరాల కోసం అప్పులు తీసుకోవడం.. అవసరం తీరాక ఐపీ నోటీస్‌లు పంపించడం.. ఇలాంటి వ్యవహారాలు ఇటీవల జిల్లాలో పెరిగిపోయాయి. పరిచయస్తులు, బంధువుల వద్దే అందినకాడికి అప్పులు తీసుకొని ఆస్తులు కూడగట్టుకుంటున్నారు. తమ టార్గెట్ నిండిందని సంతృప్తి పడ్డ తర్వాత అప్పులు ఇచ్చిన వారందరికీ ఐపీ నోటీస్‌లు పంపించి.. ఇతర ప్రాంతాలకు పరారవుతున్నారు. ఐపీ నోటీస్‌లు అందుకున్నవారంతా లబోదిబోమంటూ రోడ్డునపడుతున్నారు.


వరుస సంఘటనలతో ఆందోళన

- గత మే నెలలో వేములవాడకు చెందిన జ్యోతిష్య పూజారి దగ్గరివారు, పరిచయస్తులు, మిత్రులు, బంధువుల వద్ద దాదాపు రూ.2కోట్ల వరకు అప్పులు చేసి ఐపీ నోటీస్‌లు పంపించి పరారయ్యాడు. ఆ తర్వాత నెల రోజులకు వేములవాడలో కనిపించడంతో అప్పులు ఇచ్చిన వారంతా పోలీసులను ఆశ్రయించారు.
- రెండు రోజుల క్రితం ఓ ప్రైవేట్ స్కూల్ యజమాని రూ.1.60కోట్ల అప్పులు చేసి 22 మందికి ఐపీ నోటీసులు పంపించారు. దీంతో 22 మంది అప్పులు ఇచ్చిన వారు రోడ్డున పడ్డారు.
- ఈ రెండు సంఘటనలు మరువకముందే సిరిసిల్లలో ఎలక్ట్రానిక్స్ వ్యాపారి ఒకరు దాదాపు రూ.3కోట్లు అప్పులు చేసి పరారీ అయ్యాడు. రోజుల తరబడి ఎలక్ట్రానిక్స్ షాప్ తెరుచుకోకపోవడంతో అప్పులు ఇచ్చిన వారంతా పోలీసులను ఆశ్రయించారు.

చిరువ్యాపారులకు కష్టాలు

రాజన్న దర్శనం కోసం వేలాది మంది వచ్చే వేములవాడలో చిరువ్యాపారాలు జోరుగా నడుస్తాయి. ఇందుకు చిన్నపాటి మొత్తంలో అప్పులు తీసుకుని వడ్డీలు చెల్లిస్తూ తమ వ్యాపారాలు చేసుకుంటుంటారు. అయితే ఇటీవల వేములవాడతోపాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో అప్పులు తీసుకున్న వారంతా కోర్టు నుంచి ఐపీ నోటీస్‌లు పంపిస్తుండడంతో చిరువ్యాపారులకు అప్పులు దొరకడం లేదు. వేములవాడలో చిరువ్యాపారులకు, ఆపదలో ఉన్న జనాలకు అప్పులు పుట్టడం కష్టంగా మారిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. గతంలో ఓ మాజీ సర్పంచ్ సైతం ఇలాగే చాలా మందికి అప్పులిచ్చి ఆదుకునే వారని, చిన్న తగాదాలో ఆతన్ని మట్టుబెట్టారన్న చర్చ కూడా పట్టణంలో సాగుతోంది.

అత్యాశకు వెళ్లి నష్టపోవద్దు



అధిక వడ్డీ ఇస్తామంటే అత్యాశకు వెళ్లి మోసపోవద్దు. కష్టపడ్డ సొమ్మును జాగ్రత్తగా బ్యాంకుల్లో భద్రపరచుకోవాలి. డబ్బులు ఉంటే ఆస్తులు కొనుక్కోవాలి. అప్పులిచ్చి అవస్థలు కొని తెచ్చుకోవద్దు. అప్పు తీసుకున్న వారు ఉడాయించిన తర్వాత లబోదిబోమంటే ఏమీ రాదు. అప్పులు ఇవ్వడం చట్టబద్ధమైన చర్య కాదు. గతంలోనూ వడ్డీవ్యాపారులపై దాడులు చేసి కేసులు నమోదు చేశాం. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. – వీరప్రసాద్, వేములవాడటౌన్ సీఐ